క్లుప్తంగా

వైభవంగా చౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ట


నూతనంగా ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం

సంబేపల్లె : సీఎం కొత్తపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

లయన్స్‌ క్లబ్‌ సేవలు మరువలేనివి


సూచిక ఫ్లెక్సీలను అందజేస్తున్న దృశ్యం

సంబేపల్లె : లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ రాయచోటి టౌన్‌ సేవలు మరువలేనివని రాయచోటి రూరల్‌ సీఐ లింగప్ప బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాయచోటిలోని బీఎంఆర్‌ రెస్టారెంట్‌ యజమాని బి.నాగిరెడ్డి ఆర్థిక సహాయంతో సంబేపల్లె పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ట్రాఫిక్‌ నిబంధనలపై అవగాహన కలిగేలా 25 సూచిక ఫ్లెక్సీలను క్లబ్‌ అధ్యక్షుడు లయన్‌ షేక్‌ మహమ్మద్‌ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ లింగప్ప, ఎస్‌ఐ షరీఫ్‌లకు అందజేశారు.

జాతరకు ఆహ్వానం


కలెక్టర్‌ గిరీషా పీఎస్‌కు ఆహ్వాన పత్రిక ఇస్తున్న దృశ్యం

రాయచోటి : దేవరాయి నల్లగంగమ్మ జాతరలో పాల్గొనాలని ఆలయ కమిటీ జిల్లా కలెక్టర్‌, ఎస్పీ, ఎమ్మెల్యేలను ఆహ్వానించింది. బుధవారం ఆలయ ఈఓ కొండారెడ్డి, సంబేపల్లె సర్పంచ్‌ అంచల రామచంద్రలు కలెక్టర్‌ గిరీషా పీఎస్‌, ఎస్పీ గంగాధర్‌ రావు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌ రెడ్డిలను కలిసి ఆహ్వానం పలికారు. సంబేపల్లె మండల పరిధిలోని దేవరాయి నల్లగంగమ్మ ఆలయ ప్రాశస్త్యం గురించి వివరించారు. ఈనెల 5వ తేదీన జరిగే జాతరలో పాల్గొని దేవత సేవలో తరలించాలన్నారు.

మద్దిరేవుల సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తా


సిద్దక రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లె : మద్దిరేవులలో సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని నూతనంగా ఎన్నికైన మద్దిరేవుల సింగల్‌ విండో ప్రెసిడెంట్‌ సిద్దక రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీ తనను గుర్తించి, అప్పగించిన పదవికి న్యాయం చేస్తానని, తనకు సింగల్‌ విండో ప్రెసిడెంటుగా ఎంపిక చేసిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటానన్నారు.

పోలీసుస్టేషన్‌ తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ చైతన్య

నందలూరు(రాజంపేట) : నందలూరు పోలీసుస్టేషన్‌ను డీఎస్పీ చైతన్య తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. శాఖపరంగా అమలువుతున్న విధుల తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఈయనతోపాటు సీఐ పుల్లయ్య, ఏఎస్‌ఐ శంకర్‌నాయక్‌ పాల్గొన్నారు.

పెనగలూరు : పెనగలూరు పోలీస్‌ స్టేషన్‌ను డీఎస్పీ చైతన్య బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ పోలీస్‌ స్టేషన్‌ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి కాసేపు పోలీస్‌ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు.

నర్సరీ లైసెన్సులు తీసుకోవాలి

బి.కొత్తకోట: నర్సరీలు ఏర్పాటుచేసుకునే యజమానులు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని హార్టికల్చర్‌ అధికారి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం బి.కొత్తకోటలో ఆర్‌బీకే ఉద్యాన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ క్రాప్‌, ఈకేవైసీ, డ్రిప్‌సాగు, ఉద్యాన పథకాలు, నర్సరీల చట్టంపై అవగాహన కల్పించారు.

బైబిల్‌ పాఠశాల ప్రారంభం

కురబలకోట: అంగళ్లు సీయోను చర్చిలో డివిజన్‌ స్థాయిలో వేసవి విరామ బైబిల్‌ పాఠశాలను మదనపల్లె హెబ్రోన్‌ మందిర సేవకుడు ఇజ్రాయేల్‌ బుధవారం ప్రారంభించారు.

భక్తుల కల్పవల్లి.. నల్లగంగమ్మ తల్లి

- మొలకల పౌర్ణమికి జరుగనున్న తిరునాల
- భక్తుల రద్దీ దృష్ట్యా పకడ్బందీ ఏర్పాట్లు

సంబేపల్లె : సకల చైతన్య శక్తి స్వరూపిణి భువనైక పావని ఆశ్రిత జన పోషణి అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం సంబేపల్లె గ్రామంలో వెలసిన దేవరరాయి నల్లగంగమ్మ తల్లి భక్తుల పాలిట కల్పవల్లిగా విరాజిల్లుతోంది. దుష్ట శిక్షణ.. శిష్టజన సంరక్షణ.. ధ్యేయంగా వివిధ కాలాలలో వివిధ రూపాలలో అవతారమెత్తిన ఆ జగజ్జనని మహిషాసురమర్దిని మన ముంగిట్లో నల్లగంగమ్మ తల్లి రూపంలో అవతరించి కొలువై భక్తులకు ఆయురారోగ్యాలు, పాడిపంటలు, సంతాన సౌభాగ్యాలు, సిరిసంపదలను అనుగ్రహిస్తూ ఉంది. బీజాక్షరాలతో వెలసిన దేవరరాయి సైన్సుకు అందని సత్యంగా నిలుస్తోంది. అట్టి పరమ పావన క్షేత్రమైన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి దేవస్థానంలో గ్రామ, రాష్ట్ర, దేశ సౌభాగ్యం నిమిత్తం ఈ నెల 5 తేదీన మొలకల పౌర్ణమి సందర్భంగా అత్యంత వైభవంగా జాతరను నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర

త్రేతాయుగంలో ఈ ప్రాంతం దట్టమైన అడవిగా ఉండేది. రైతులు పశువులను మేపుకునేవారు. అప్పట్లో కాలికి గాయమై కుంటుతూ నడుస్తున్న ఓ మేక ఓ రోజు ప్రాంతంలోని ముల్లపొదల్ని దాటగానే మామూలు మేకలా నడిచింది. ఇది గమనించి ఆశ్చర్యపోయిన మేకల కాపరి ముళ్లపొదల్లో వెతకగా ఓ బండరాయి కనిపించింది. ఆ రాయిపై తెలియని భాషలో అక్షరాలు, ముగ్గులు ఉన్నాయి. దీనిని శక్తివంతమైనదిగా గ్రహించిన కాపరులు పూజలు చేయడం ప్రారంభించారు. ఇదే సమయంలో ఈ దారిన వెలుతున్న ఓ మహాముని పూజలు అందుకుంటున్న బీజాక్షరాలతో వెలసిన ఈ రాయిని శక్తిప్రదాయినిగా గుర్తించి, ఎదురుగా నల్లగంగమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం జరిగింది. తూర్పున కదిరి దేవుని కాండ, పడమర దుర్గం, ఉత్తరాన వెదుర్గకొండ, దక్షిణాన ముగదాల కొండల మధ్యన వెలసిన నల్లగంగమ్మ తల్లికి ఓ చిన్న ఆలయం నిర్మితమైంది. ఈ క్రమంలో ఓ రోజున నల్లగంగమ్మ తల్లి రాయచోటికి చెందిన వ్యాపారి మునగా మురళీ స్వామి గారికి కలలో కనిపించి తన ఆలయాన్ని పునరుద్ధరించమని ఆజ్ఞాపించింది. అమ్మవారి ఆజ్ఞ ప్రకారం ఆయన తన శక్తి మేరకు ఆలయాన్ని అభివృద్ధి పరిచి నిత్యం పూజలు జరిగేలా విశేష కృషి చేస్తున్నారు.


అలంకరణలో శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తల్లి


నల్లగంగమ్మ ఆలయం

జాతరకు ముమ్మర ఏర్పాట్లు

జాతర సందర్భంగా ఈ నెల 5 వ తేదీ శుక్రవారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, 9 గంటలకు హోమాలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 6.30 గంటల నుంచి అమ్మవారి పల్లకీసేవ, రాత్రి 7.30 గంటల నుంచి చెక్కభజన, 8.30 గంటల నుంచి జబర్దస్త్‌ టీం ప్రోగ్రామ్‌, సప్తస్వరాల ఆర్కెస్ట్రా, డ్యాన్స్‌, సాంస్కృతిక కార్యక్రమాలు, తెల్లవారుజామున చాందినీబండ్ల మెరవని తదితర కార్యక్రమాలతో జాతరను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణకర్త, ధర్మకర్తల మండలి చైర్మన్‌ మునగా మురళీ స్వామి, కార్యనిర్వహణాధికారి కొండారెడ్డి, కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, భూషణం గిరిజ, పాపులమ్మ, శ్రీదేవి, సంపూర్ణమ్మ, చలపతి తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు రానుండటంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

రేపటి నుంచి కాలభైరవుడి తిరునాల

రాయచోటి టౌన్‌ : రేపటి నుంచి (5వ తేదీ శుక్రవారం) కాలభైరవుడి తిరునాల నిర్వహిస్తున్నట్టు కార్యనిర్వాహకులు మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, ప్రతాప్‌ రెడ్డిలు తెలియజేశారు. తిరునాలకు ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు. తిరునాల రోజు ఉదయం 5 గంటలకు అభిషేకాలు, కలశారాధన, రుద్రహోమం చేయనున్నారు. అనంతరం అన్నదానం ఉంటుందన్నారు. రాత్రి అంగరంగ వైభవంగా విద్యుత్‌ దీపాలతో అందంగా అలంకరించిన చాందినీబండ్లతో వైభవంగా తిరునాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే శనివారం ఉదయం మైలు తిరునాల ఉంటుందని చెప్పారు.

వైభవంగా కలశ స్థాపన పూజలు

సిద్దవటం : పెంచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం స్వామి వారికి కలశ స్థాపన పూజలు నిర్వహించినట్టు వేద పండితులు ప్రతాప్‌ శర్మ, రెడ్డి శర్మలు తెలిపారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ నరసింహ జపం, దీక్షా హోమం, అభిషేకం, తీర్థప్రసాదాలు వంటి పూజలు చేశారు. సాయంత్రం అంకురార్పణ, దీక్షా హోమం, తీర్థ ప్రసాదాల వినియోగం జరిపారు.

ప్రజలకు మరింత చేరువగా సేవలు


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజమ్మ, పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

రాయచోటి అర్బన్‌ : అన్నివర్గాల ప్రజలకు మండల పరిషత్‌ సేవలు మరింత చేరువయ్యేలా నూతనంగా నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయం భవనం అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి రూరల్‌ ఎంపీడీఓ కార్యాలయం నూతన భవనాన్ని ఎంపీపీ రాజమ్మ, స్టేట్‌ సివిల్‌ సప్లయ్స్‌ డైరెక్టర్‌ పోలు సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డిలతో కలసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేసే క్రమంలో భాగంగా సచివాలయం వ్యవస్థను పల్లె ప్రజల ముంగిటకు తీసుకు వచ్చిందన్నారు. అధునాతన హంగులతో భవనం నిర్మించడం శుభపరిణామం అన్నారు. అభివృద్ధి జరగలేదని విమర్శించే వారికి పంచాయతీలలో కనిపించే సచివాలయం భవనాలు, తారురోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలే సమాధానం చెబుతాయంటూ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ వండాడి వెంకటేశ్వర్లు, ఏసీఐఐసీ స్టేట్‌ డైరెక్టర్‌ శ్రీనివాసులురెడ్డి, వైస్‌ ఎంపీపీ జయపాల్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ మండల నేత పల్లపు రమేష్‌, ఎంపీడీఓ మల్‌రెడ్డి, తహసీల్దార్‌ ప్రేమంతకుమార్‌, ఎంపీటీసీలు ప్రభాకరరెడ్డి, రామచంద్రారెడ్డి, నాగసుబ్బమ్మ, చిట్టెమ్మ, నాగవేణి, సహదేవమ్మ, సర్పంచ్‌లు పోలు సావిత్రమ్మ, రాయవరం మమత, కసిరెడ్డి సుబ్బలక్షుమమ్మ, ప్రభావతమ్మ ,ఫాహిదా, నాగవేణి, రెడ్డెమ్మ, వెంకటేష్‌, కో–ఆప్షన్‌ సభ్యులు ఖాదర్‌బాషా, దివాన్‌, నాగేశ్వరరావు, వైఎస్‌ఆర్‌సిపి నేతలు నరసింహారెడ్డి, తిరుపాల్‌నాయుడు పాల్గొన్నారు.

నేడు వీరాంజనేయస్వామి జాతర

సంబేపల్లె : పాలాలబండ సమీపంలో కొలువైన వీరాంజనేయస్వామి జాతర నేడు(గురువారం) నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. రాత్రికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు తాకిడిని దృష్టిలో ఉంచుకొని పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్‌గా వాణి

రాజంపేట రూరల్‌ : సోషల్‌ జస్టిస్‌ ఫర్‌ వరల్డ్‌ హ్యూమన్‌ రైట్స్‌ కౌన్సిల్‌ (ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ) జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా గాడి వాణి నియమితులయ్యారు. కడప కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు జాతీయ చైర్మన్‌ డాక్టర్‌ కొప్పుల విజయ్‌ కుమార్‌ నియామక పత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు.

మదరసాలో అడ్మిషన్లు ప్రారంభం

రాయచోటి టౌన్‌ : రాయచోటిలోని దారుల్‌ ఉలూమా ఇందాదియా మదరసాలో అడ్మిషన్లు ప్రారంభమైనట్టు రాయచోటి మదరసా ప్రిన్సిపల్‌ ముక్తి సయ్యద్‌ మసూద్‌ సాకిబ్‌ సాహెబ్‌ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూరానీ, ఖాయిదా, నాజిర, ఖుర్‌ఆన్‌, హిఫ్జ్‌, ఫారసీ, దర్సే నిజామీ ''మౌల్వికోర్స్‌'' తరగతులలో చేరే విద్యార్థులకు ఈనెల 6వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మదరసాలో చేరే విద్యార్థులకు ఉచిత భోజనం, వైద్యం, వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దినియాత్‌ చదివే విద్యార్థులకు చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ సిలబస్‌ ప్రకారం 10వ తరగతి వరకు ఉచిత విద్యా బోధన అందించి ఓపెన్‌ స్కూల్‌ ద్వారా హైస్కూల్‌ పరీక్షలు రాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు టిప్పు సుల్తాన్‌ వర్ధంతి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : నేడు టిప్పు సుల్తాన్‌ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆప్‌కీ ఆవాజ్‌ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్‌ బాషా పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్‌ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మైసూర్‌ పులిగా పేరొందిన టిప్పు సుల్తాన్‌ బ్రిటిష్‌ వారిని ఎదిరించిన గొప్ప యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆప్‌కీ ఆవాజ్‌ నాయకులు ఈదుల్లా పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి జయంత్యుత్సవాలు


విశేష అలంకరణలో స్వామివారి మూలవిరాట్‌

రైల్వేకోడూరు రూరల్‌ : రెడ్డివారిపల్లె వద్ద ఉన్న లక్ష్మీ నృసింహా స్వామి జయంత్యుత్సవాలు నేటి(గురువారం) నుంచి మూడు రోజుల పాటు జరుపనున్నట్లు శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త పంద్రా నరసింహులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ స్వామివారి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో గురు, శుక్ర, శని వారాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ సలహాదార్‌ శ్రీమాన్‌ డాక్టర్‌ వేదాన్తం శ్రీ విష్ణు భట్టాచార్యులు పర్యవేక్షణలో తమిరిశ సూర్యకుమారాచార్యులు నేతృత్వంలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 4న ప్రత్యేక పూజ కార్యక్రమాలు, 5న శుక్రవారం రాత్రి 8:30 గంటలకు స్వామి వారి కల్యాణం జరుగనుందన్నారు. భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

వైభవంగా నృసింహుడి బ్రహ్మోత్సవాలు

చిన్నమండెం : మండెం లక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం శ్రీస్వామి వారికి అభిషేకం, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించగా సాయంత్రం పుణ్యాహవాచనము ఆచార్య రుత్విక్‌వరణం, రక్షాబంధం, అంకురార్పణ, ధ్వజస్తంభ, ఆరాధనము, పాలకాది స్థాపనము తదితర కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ముస్తాబైన ఆలయం

పెనగలూరు : పెంచలకొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం కల్యాణానికి ముస్తాబైంది. గురువారం రాత్రి జరగనున్న లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈటమాపురం గ్రామం నుంచి కొండ పైవరకు అలాగే నాయుడువారిపల్లె నుంచి కొండపైకి వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ఆలయ ట్రస్టు చైర్మన్‌ బత్తిన తిరుపాల్‌ రెడ్డి, వైస్‌ చైర్మన్‌ పెద్ద వెంగల్‌రెడ్డిల ఆధ్వర్యంలో కల్యాణం జరుగనుంది. రాత్రికి ఈటమాపురం గ్రామస్తులు అన్నదానం చేయనున్నారు.

కేంద్రం ప్రైవేటీకరణను వెంటనే ఆపాలి


రాస్తారోకో చేస్తున్న వామపక్ష, అఖిలపక్ష నేతలు

రాయచోటి అర్బన్‌ : పాలకులు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని వామపక్ష, అఖిలపక్ష నేతలు డిమాండ్‌ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వామపక్ష, అఖిలపక్ష నేతలు బుధవారం పట్టణంలోని నేతాజీ సర్కిల్‌లో రాస్తారోకోను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ రాష్ట్రనేత ఓబులయ్యలు మాట్లాడుతూ ఉక్కుఫ్యాక్టరీ ప్రైవేటీకరణ యత్నాలను వెంటనే ఆపని పక్షంలో ప్రత్యేక ఉద్యమంతో కేంద్ర – రాష్ట్రప్రభుత్వాలను స్తంభింపజేస్తామన్నారు. అనంతరం రాస్తారోకో చేస్తున్న వారిని పోలీసులు అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాసులు, పి.ఎల్‌, నరసింహులు, బీఎస్పీ నేత యుగంధర్‌, సీపీఐ, సీపీఎం నేతలు శ్రీనివాసులు, రామాంజులు, కాంగ్రెస్‌ నేత చెన్నక్రిష్ణ, రామాంజులు, సగీర్‌, సుధీర్‌కుమార్‌, విశ్వనాథనాయక్‌ పాల్గొన్నారు.

రాజంపేటలో..


రాజంపేట రూరల్‌ : విశాఖ స్టీల్‌ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే విధానాన్ని ఆపివేయాలి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్‌ రాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్‌లు డిమాండ్‌ చేశారు. జాతీయ రహదారిపై ఎన్టీఆర్‌ సర్కిల్‌ వద్ద బుధవారం ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ నాడు విశాఖ పరిశ్రమ సాధన కోసం సుదీర్ఘకాలం పోరాటాలు, త్యాగాలు, బలిదానాలు, రాజకీయ నాయకుల రాజీనామాలు చేయడంతో వచ్చిందన్నారు. బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తూ అమ్మకానికి పెట్టిందని తెలియజేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని తెలియజేశారు. ఈ రాస్తారోకోలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఈ.సికిందర్‌, సీఐటీయూ నాయకులు ఎస్‌.నరసింహ, గాలి చంద్ర, కె.వెంకటయ్య, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేణుకా యల్లమాంబ తిరునాల


రేణుకా యల్లమాంబ మూలవిరాట్‌

సిద్దవటం : మాచుపల్లె గ్రామంలో వెలసిన రేణుకా యల్లమాంబ తిరునాల గురువారం నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు బుధవారం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గురువారం తెల్లవారు జామున అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగునున్నారు. వ రాత్రి అమ్మవారి ఊరేగింపు, అనంతరం ఆర్కెస్ట్రా కార్యాక్రమాలు ఉంటాయన్నారు. 6న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ రేణుకా యల్లమ్మ కల్యాణం నిర్వహిస్తామన్నారు. 7న బోనాలు, మధ్యాహ్నం 3 గంటలకు వృషభ రాజములచే బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్లకు మొదటి బహుమతి రూ.1,00,116, రెండవ బహుమతి రూ.70,116, మూడవ బహుమతి రూ.50,116, నాల్గవ బహు మతి రూ. 30,116, 5వ బహుమతి రూ. 20, 116 ఉంటాయన్నారు. 8న ఉదయం అమ్మవారి ఊరేగింపు, వసంతోత్సవం ఉంటుందన్నారు. కడప రాజా జ్యూవెలర్స్‌ అధినేత జరుగు రాజశేఖర్‌రెడ్డి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.

న్యాయవాదిపై పోలీసుల దాడి హేయం


నిరసన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

రాయచోటి అర్బన్‌ : కడపకు చెందిన న్యాయవాది సుబ్రమణ్యంపై దాడి చేయడమే కాక అక్రమంగా అరెస్టు చేసిన కడప సీఐ, ఎస్‌ఐలు రామక్రిష్ణ, తాహిర్‌లను వెంటనే సస్పెండ్‌ చేయాలని రాయచోటి బార్‌ అసోసియేషన్‌ న్యాయవాదులు డిమాండ్‌ చేశారు. న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ న్యాయవాదులు రాయచోటిలో కోర్టు విధులను బహిష్కరించి నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా బార్‌ అసోసియేషన్‌ కార్యదర్శి రామాంజనేయులు, ఐఏఎల్‌ ఉమ్మడి జిల్లాల కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈశ్వర్‌లు మాట్లాడుతూ కడప ఐటీఐ సర్కిల్‌లో సీపీఐ మిత్రులతో కలసి నిలబడి ఉన్న న్యాయవాది సుబ్రమణ్యంను సీఐ, ఎస్‌ఐలు బలవంతంగా ఆటోలో వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి చితకబాది, బట్టలను చించివేయడం హేయమైన చర్య అని అన్నారు. సుబ్రమణ్యం ఏదైనా నేరం చేసి ఉంటే 41 ఏ నోటీసు ఇచ్చిన తర్వాత అతనిపై చర్యలు తీసుకునే అవకాశం ఉండేదన్నారు. అలాకాకుండా పోలీసులు న్యాయవాది సుబ్రమణ్యంపై దౌర్జన్యం చేయడాన్ని ఖండించారు. సమాజంలో న్యాయం కోసం పోరాడే న్యాయవాదులకే రక్షణ లేకపోతే ఇక సామాన్యులకు పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ న్యాయవాదులు షరీఫ్‌, రాజకుమార్‌, ధనుంజయ, చిన్నయ్య, క్రిష్ణయ్య, హుమయూన్‌, శ్రీధర్‌ మూర్తి, నాగముని, ఖాదర్‌బాషా, నాగేశ్వరరావు, ఆదిరెడ్డినాయక్‌, ఖిజర్‌అలీఖాన్‌, వరలక్ష్మి, నిరంజన్‌ తదితరులు పాల్గొన్నారు.

అలుపెరగని పోరాటాలు ఏఐవైఎఫ్‌కే సాధ్యం


వేడుకలను నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

రాయచోటి అర్బన్‌ : యువత, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి విజయం సాధించిన ఘనత ఒక్క ఏఐవైఎఫ్‌కే దక్కుతుందని ఆసంఘం అన్నమయ్య జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్‌ అన్నారు. పట్టణంలోని శ్రీనివాస ఐటీఐ ఆవరణలో బుధవారం ఏఐవైఎఫ్‌ 64వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాయ చోటి కార్యదర్శి ఎస్‌.శ్రీనివాసులు పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్‌ నేత చలపతి, ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు లవకుమార్‌, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెలకువలు అవసరం

వైవీయూ : పోటీ పరీక్షల్లో రాణించేందుకు సన్నద్ధమయ్యే విద్యార్థులు విజేతలుగా రాణించేందుకు మెలకువలు పాటించాలని పోలీసుశాఖ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ డి.భాస్కర్‌ రెడ్డి సూచించారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో కళాశాల విద్యార్థులకు కెరీర్‌ గైడెన్స్‌ సెల్‌ ఆధ్వరలో పోలీస్‌ రిక్రూట్‌మెంట్‌ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో ఉద్యోగం సాధించాలన్న తపన కలిగినవారు అందుకు తగ్గట్టుగా శ్రమించాలన్నారు. అనంతరం పోటీపరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. ప్రిన్సిపాల్‌ జి. రవీంద్రనాథ్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ పి. రమేష్‌, కెరీర్‌ గైడెన్స్‌ సెల్‌ కన్వీనర్‌ డి.వీరనాగేంద్రకుమార్‌ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

కడప ఎడ్యుకేషన్‌ : విద్యారంగ సంస్కరణల వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకపోగా, విద్యా వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారిందని యూటీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కేఎస్‌ఎస్‌ ప్రసాద్‌ విమర్శించారు. బుధవారం కడపలోని యూటీఎఫ్‌ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రణాళిక లేకుండా ప్రవేశపెట్టిన విద్యారంగ సంస్కరణల వల్ల ఒక కిలోమీటర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలోకి విలీనం చేశారన్నారు. ఉన్నత పాఠశాలలో ఉన్న విద్యార్థులకు సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా చేస్తామని చెప్పి కూడా అమలు కాలేదని విమర్శించారు. విద్యాశాఖ వెకేషన్‌ డిపార్టుమెంట్‌ అని వేసవి సెలవుల్లో కూడా వివిధ కార్యక్రమాలు చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం తగదన్నారు.

సీఎం జగన్‌ పాలనకు జననీరాజనం


పుల్లంపేట: పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్‌ కొరముట్ల, కొల్లం గంగిరెడ్డి

రైల్వేకోడూరు : జగన్‌ నాయకత్వం మీద రాష్ట్ర ప్రజలు పూర్తి సంతోషంగా ఉన్నారని ప్రభుత్వవిప్‌ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రభుత్వం చేకూరుస్తున్న మేలును వివరించడం, విపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొట్టడమే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం గ్రాండ్‌ సక్సెస్‌ కావడంపై బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్‌ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ మెగా పీపుల్స్‌ సర్వేలో 1.16 కోట్ల కుటుంబాల ప్రజలు సీఎం జగన్‌ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ 82960 82960 నెంబర్‌కు మిస్ట్‌ కాల్స్‌ ఇచ్చారన్నారు. 7 లక్షల మంది గృహసారథులు, నాయకుల ద్వారా ఈ కార్యక్రమం సంపూర్ణంగా విజయవంతమైందన్నారు. ప్రజల్లో సీఎం జగనన్న ప్రభుత్వం మీద మంచి స్పందన వచ్చిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 80 శాతానికి పైగా కుటుంబాలు ముఖ్యమంత్రి జగన్‌ పాలన పట్ల సంపూర్ణ విశ్వాసంతో ఉన్నట్టు సర్వేలో నిరూపితమైందన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో 85 శాతం అంటే 69వేల మంది కుటుంబాలను గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కలిశారని, 41వేల మంది కుటుంబాల నుంచి మిస్ట్‌ కాల్స్‌ వచ్చాయంటే పరిపాలన ఏ విధంగా ఉందో అర్థంచేసుకోవచ్చన్నారు. ఏ గడపకు వెళ్ళినా చిరునవ్వుతో ప్రజలు ఆహ్వానిస్తున్నారని గుర్తుచేశారు. కులం, మతం, పార్టీలకతీతంగా వైఎస్సార్‌సీపీ పాలన చేస్తోందన్నారు. ఈ మాట చంద్రబాబు ఒక్కసారైనా తన ప్రభుత్వ హయాంలో చెప్పగలిగారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా సలహామండలి చైర్మన్‌ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపి టూరిజం డైరెక్టర్‌ సాయికిషోర్‌రెడ్డి, చెవ్వ శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్‌ శివయ్య, ఉప సర్పంచ్‌ తోట శివసాయి, జెట్పీటీసీ రత్నమ్మ, మండల నాగేంద్ర, సుధాకర్‌రాజు, గునిశెట్టి రమేష్‌, రామక్రిష్ణ, జనార్దన్‌రాజు, బండారు మలి దామర్ల సిద్దయ్య, మల్లు క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వంలో..

పుల్లంపేట : మండల పరిధిలోని జాగువారిపల్లె సచివాలయ పరిధిలోని ప్రకాశం కాలనీలో బుధవారం నియోజకవర్గ సీనియర్‌ నాయకులు కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వల్ల ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారన్నారు. అందువలన ప్రజలందరూ వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సుఖసంతోషాలుగా జీవిస్తున్నారన్నారు. అలాగే సకాలంలో వర్షాలు కురిసి రైతన్నల ముఖాలలో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ముఖ్యంగా అవ్వా తాతలు మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా జగనే కావాలని కోరుకుంటున్నారన్నారు. అనంతరం కొల్లం గంగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి వైపు ప్రజాదరణ అధికంగా ఉందని, పుల్లంపేట మండలానికి వైఎస్‌ కుటుంబానికి విడదీయరాని బంధం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ నరసింహకుమార్‌, ఎంపీడీఓ ప్రకాశం, ఎస్‌ఐ సుబ్బారెడ్డి, మండల కన్వీనర్‌ ముస్తాక్‌, జెడ్పీటీసీ దార్ల గీతారామనాథం, సచివాలయ మండల కన్వీనర్‌ హరినాథ్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్‌ సుధాకర్‌ రాజు, వై.మల్లికార్జున రెడ్డి, నరసింహారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కొరముట్ల

ఇటీవల కొరియాలో జరిగిన జాతీయ తైక్వాండో పోటీల్లో కోడూరుకు చెందిన ఐదుగురు విద్యార్థులు బ్లాక్‌ మెడల్‌ సాధించిన విషయం తెలిసిందే. బుధవారం పట్టణంలోని ఎస్కే అకాడమీలో మెడల్స్‌ సాధించిన విద్యార్థులకు ప్రభుత్వవిప్‌ కొరముట్ల బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.